సాక్షి
వైఎస్‌ఆర్‌ జిల్లా

గురువారం ၊ 26 ၊ అక్టోబర్‌ ၊ 2023



వీక్లీ బెస్ట్‌ పెర్ఫార్మన్స్‌ అవార్డు
పోలీసులను ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్‌ కౌశల్‌ సిబ్బందికి 'వీక్లీ బెస్ట్‌ పెర్ఫార్మన్స్‌ అవార్డు'ను అందజేస్తామని ప్రకటించారు. -8లో



ల్యాప్‌టాప్‌ అప్పగింత
బస్సులో ల్యాప్‌టాప్‌, బంగారు బ్రాస్‌లెట్‌ మరచిపోయిన ప్రయాణికుడికి మైదుకూరు ఆర్టీసీ అధికారులు తిరిగి అప్పజెప్పారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.2/20.2

వాతావరణం
జిల్లాలో బుధవారం 20.2 – 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్‌

న్యూస్‌రీల్‌

27న తలనీలాల వేలంపాట
సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లె సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజ స్వామి ఆలయంలో తలనీలాల సేకరణకు ఈ నెల 27న ఉదయం పది గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్‌ కొండారెడ్డి తెలిపారు. కార్తీక మాసోత్సవంలో స్వామికి భక్తులు ఇచ్చే తలనీలాలు పోగు చేసేందుకు సిద్దవటం రంగనాయక స్వామి ఆలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు
కడప కోటిరెడ్డిసర్కిల్‌: అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం తమిళనాడు రాష్ట్రం తిరుమన్నామలైకి ఈ నెల 27న జిల్లాలోని వివిధ డిపోల నుంచి ఎనిమిది ప్రత్యేక సర్వీసులు నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలి మేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప నుంచి రాత్రి 9గంటలకు, జమ్ములమడుగు నుంచి ఉదయం ఏడు గంటలకు, మైదుకూరు నుంచి ఉదయం 7గంటలకు, సాయంత్రం 6.00 గంటలకు, పోరుమామిళ్ల నుంచి ఉదయం 5.30, 6.00 గంటలకు, పులివెందుల నుంచి రాత్రి 8.00 గంటలకు, ప్రొద్దుటూరు నుంచి రాత్రి 9.00 గంటలకు, బద్వేలు నుంచి ఉదయం 6.00 గంటలకు సర్వీసులు నడుస్తాయన్నారు. బస్సులకు రిజర్వేషన్‌ సౌకర్యం ఉందని, ప్రయాణికులు గిరి ప్రదక్షిణకు రానూ, పోనూ టిక్కెట్లను రిజర్వు చేసుకోవాలని కోరారు.


ఆరోగ్యమే మహాభాగ్యం
కడప రూరల్‌: అందరి ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమం కింద నిర్వహిస్తున్న వైద్య శిబిరాల ద్వారా స్థానిక ప్రజలు ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా 11 ప్రాంతాల్లో మెడికల్‌ క్యాంపులు జరిగాయి. ఈ శిబిరాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎఫ్‌యూ పరీక్షలు
ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి 3వసెమిస్టర్‌, 7వ సెమిస్టర్‌ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైస్‌ చాన్సలర్‌ ఆచార్య బి. ఆంజనేయ ప్రసాద్‌, రిజిస్ట్రార్‌ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్కూల్‌ ఆఫ్‌ ప్లానింగ్‌లోని టౌన్‌ ప్లానింగ్‌, బిల్డింగ్‌ టెక్నాలజీస్‌, డిజిటల్‌ టెక్నిక్స్‌ ఫర్‌ డిజైన్‌ అండ్‌ ప్లానింగ్‌, ఇంటీరియర్‌ డిజైన్‌, కాలేజ్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌లోని పెయింటింగ్‌, ఫొటోగ్రఫీ, అప్లైడ్‌ ఆర్ట్‌, యానిమేషన్‌, ఆర్ట్‌ హిస్టరీ విభాగాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తర్వులు అమలు చేయాలి
ప్రొద్దుటూరు: స్కూల్‌ ఎడ్యుకేషన్‌ కమిషనర్‌ ఈ నెల 17న ఇచ్చిన ఉత్తర్వులను ఆర్జేడీ, డీఈఓలు వెంటనే అమలుచేయాలని ప్రైవేటు టీచర్స్‌, లెక్చరర్స్‌ యూనియన్‌ రాష్ట్ర కన్వీనర్‌ గద్దం రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు, ఎయిడెడ్‌ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు, నాన్‌ టీచింగ్‌ సిబ్బందికి బ్యాంకు ఖాతా ద్వారా వేతనాలివ్వాలని, సీపీఎఫ్‌ను జమ చేయాలని, ఆరోగ్య బీమా చెల్లించాలని ఉత్తర్వుల్లో కమిషనర్‌ పేర్కొన్నట్లు వివరించారు. ముందస్తు అనుమతి లేకుండా సిబ్బందిని తొలగించరాదని, అకడమిక్‌ క్యాలెండర్‌ ప్రకారం ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని తెలిపారు.

రాజంపేటలో కన్యాకుమారి రైలు స్టాపింగ్‌
కడప కోటిరెడ్డిసర్కిల్‌: మహారాష్ట్రలోని పుణె నుంచి కన్యాకుమారి వెళ్లే రైలుకు అన్నమయ్య జిల్లా రాజంపేటలో స్టాపింగ్‌ ఉంటుందని కడప రైల్వే సీనియర్‌ కమర్షియల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎ.జనార్దన్‌ తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు వివరించారు. ఈ నెల 22వ తేదీ నుంచి 29వతేదీ వరకు గుత్తి, ధర్మవరం, పాకాల, చిత్తూరు, కాట్పాడి మీదుగా మళ్లించిన విషయం విదితమే. ఈ నెల 31వ తేదీ నుంచి రాజంపేటలో ఈ రైలు ఆగనుందని ఆయన తెలిపారు. పుణె నుంచి కన్యాకుమారికి వెళ్లేటపుడు మధ్యాహ్నం 1.35 గంటలకు, తిరుగు ప్రయాణంలో రాజంపేటలో ఉదయం 5.45 గంటలకు రైలు రాజంపేటలో ఆగుతుందన్నారు.

'ఏక్‌ భారత్‌ శ్రేష్ఠ భారత్‌'కు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్‌, తదితరులు

వైవీయూ: ఈ నెల 25వ తేదీ నుంచి నవంబర్‌ 5వతేదీ వరకు పంజాబ్‌లో నిర్వహించనున్న 'ఏక్‌ భారత్‌ శ్రేష్ఠ భారత్‌' జాతీయస్థాయి క్యాంపునకు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్సీసీ కేడెట్‌ అభిరామ్‌ ఎంపికయ్యాడు. కళాశాల ప్రిన్సిపల్‌ డా.జి.రవీంద్రనాథ్‌, ఎన్సీసీ అధికారి డాక్టర్‌ ఆర్‌.నీలయ్య విద్యార్థిని అభినందించారు. వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి క్యాంపుల్లో పాల్గొనడంతో విద్యార్థులకు వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ డా.ఎం.రమేష్‌, ఎన్సీసీ అధికారి డా.మహేష్‌, అధ్యాపకులు డా.రామకృష్ణ, డా.విశ్వనాథరావు పాల్గొన్నారు.

ఓటీపీ వస్తే ఓపీ టికెట్‌

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందేందుకు ఓపీ టిక్కెట్‌ తప్పనిసరి. ప్రజలకు జబ్బు చేసినపుడు గంటల తరబడి నిలబడి ఓపీ టికెట్‌ కోసం వేచి యుండడం కష్టమే. ఇది గుర్తించుకున్న ప్రభుత్వం అభా యాప్‌తో కొత్త విధానం అమలులోకి తెచ్చింది. దీంతో క్యూలో నిలవకుండా సులభంగా ఓపీ టికెట్‌ పొందవచ్చు.

- పేదల దరికే వైద్య సేవలందించిన సర్కార్‌
- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- జిల్లా ఆస్పత్రిలో రోగుల నిరీక్షణకు స్వస్తి
- ప్రొద్దుటూరు ఆస్పత్రిలో క్యూఆర్‌ కోడ్‌ ఏర్పాటు



ఓపీ టికెట్‌ కోసం క్యూలో ఉన్న ప్రజలు (ఇన్‌సెట్‌) జిల్లా ఆస్పతిల్రో ఏర్పాటు చేసిన అభా యాప్‌ క్యూ ఆర్‌ కోడ్‌

ప్రొద్దుటూరు క్రైం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు జబ్బు చేసినప్పుడు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వెళ్తారు. ఇక్కడ పెద్దగా జనం ఉండరు కాబట్టి సూది మందు, కావాల్సిన ఔషధాలు తీసుకొని నిమిషాల వ్యవధిలో ఆస్పత్రి నుంచి బయటికి రావచ్చు. సెలైన్‌ బాటిల్‌ ఎక్కించడం, ఇతర ప్రత్యేక కారణాలతో మాత్రమే ఈ తరహా ఆస్పత్రుల్లో 1–2 గంటలు పట్టే అవకాశముంటుంది. అయితే ఇందుకు భిన్నంగా ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని జిల్లా ఆస్పత్రికి నియోజకవర్గంతోపాటు మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు తదితర ప్రాంతాల నుంచి వివిధ ఆరోగ్య సమస్యలతో వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఆస్పత్రి లోని గైనకాలజీ, జనరల్‌ మెడిసిన్‌, చిన్న పిల్లలు, చర్మవ్యాధులు, ఈఎన్‌టీ, అప్తాల్మిక్‌ విభాగాలకు రోజూ సుమారు 1300–1500 ఓపీ ఉంటుంది. వందల మంది రావడంతో ఆస్పత్రిలో భారీ క్యూ ఉంటుంది. వీరిలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు, వృద్ధులు అధికం. ఓపీ టికెట్‌ తీసుకోవడానికే గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండడంతో ఇబ్బందులు పడాల్సిందే.

క్యూలో నిరీక్షించకుండానే...
ఆస్పత్రికి వచ్చిన రోగులు గంటల తరబడి క్యూలో నిరీక్షించకుండా సులభంగా ఓపీ టికెట్‌ పొందేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన విధానం అమలు చేస్తోంది. ఈ విధానాన్ని ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో కొద్ది రోజుల కిందట లాంఛనంగా ప్రవేశపెట్టారు. సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా ప్రజలకు దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. రోగులు, వారి బంధువుల వద్ద స్మార్ట్‌ మొబైల్‌ ఉన్నా యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకునేంత అవగాహన ఉండదు. ఇందుకోసం ఓపీ విభాగంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడి సిబ్బంది మొబైల్‌తో ఆస్పత్రికి వచ్చే వారిని గుర్తించి అభా యాప్‌ను డౌన్‌లోడ్‌ చేయిస్తున్నారు. తర్వాత క్యూ ఆర్‌ కోడ్‌ను ఎలా స్కానింగ్‌ చేయాలో అవగాహన కల్పిస్తున్నారు. ఆస్పత్రికి ఎప్పుడు వచ్చినా స్వతహాగా క్యూఆర్‌ కోడ్‌ను స్కానింగ్‌ చేసుకునేలా తర్ఫీదు ఇస్తున్నారు. యువకులు క్యూ ఆర్‌ కోడ్‌ సూచనలు చదివి యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకుంటున్నారు.

అభా యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకునే విధానం..
అభా యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవడం చాలా సులభం. ముందుగా స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్‌ ప్లే స్టోర్‌కు వెళ్లి అభా యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకోవాలి. యాప్‌లో ఫోన్‌ నంబర్‌ నమోదు చేయగానే కొన్ని సెకన్ల వ్యవధిలోనే ఓటీపీ వస్తుంది. ఓటీపీని ఎంటర్‌ చేసిన తర్వాత ఓపీ విభాగం పక్కన ఏర్పాటుచేసిన క్యూ ఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేయగానే షేర్‌ చేయమని వస్తుంది. షేర్‌ చేసిన వెంటనే టోకెన్‌ నంబర్‌ వస్తుంది. టోకెన్‌ నంబర్‌ను ఓపీ విభాగంలో చూపిస్తే ఓపీ చీటీ ఇస్తారు. దాన్ని తీసుకొని ఆయా ఓపీ విభాగాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. ప్రారంభంలో ఈ యాప్‌ గురించి చాలా మందికి అవగాహన లేకపోవడంతో స్మార్ట్‌ ఫోన్‌ చేతిలో ఉన్నా క్యూలోనే నిల్చునే వారు. ఆస్పత్రి సిబ్బంది అవగాహన కల్పించిన తర్వాత చాలామంది ఈ యాప్‌ను ఉపయోగించుకొని ఓపీకి వెళ్తున్నారు. త్వరగా వైద్య సేవలు పొందే అవకాశం కల్పించడంతో ఆస్పత్రికి వచ్చే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే అవగాహన చేసుకుంటున్నారు



జిల్లా ఆస్పత్రికి వచ్చే వారిలో అత్యధికులు గ్రామీణులే. స్మార్ట్‌ ఫోన్‌తో వస్తున్న వారిని గుర్తించి అభా యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఫోన్‌లో యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకున్నవారు నేరుగా క్యూ ఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేసి ఓపీ చీటి పొందవచ్చు. క్యూలో ఉండాల్సిన అవసరం లేదు. – డాక్టర్‌ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌, ప్రొద్దుటూరు

పెద్ద దర్గా ఉరుసు.. అందరి పండుగ

డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కల్చరల్‌: రాష్ట్ర ప్రభుత్వం కడప పెద్ద దర్గా ఉరుసు నిర్వహిస్తోందని, అందరి పండుగగా భావించి ప్రజలు విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్‌ బాషా పిలుపునిచ్చారు. దర్గా పీఠాధిపతి హజరత్‌ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్‌ అధ్యక్షతన స్థానిక అమీన్‌పీర్‌(పెద్ద)దర్గాలోని ముషాయిరా హాల్‌లో దర్గా ఉరుసు ఉత్సవాల నిర్వహణకు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, నగర ప్రముఖులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉత్సవాలకు దక్షిణ భారతదేశం నలమూలల నుంచి భక్తులు వస్తారన్నారు. రోడ్లు, సర్కిళ్ల విస్తరణ పనులతో ఇబ్బంది కలగకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌ విజయరామరాజు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే దర్గా ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత పోలీసు, నగర పాలక సంస్థ, విద్యుత్‌ శాఖలపై ఉందన్నారు. నెలరోజుల ముందే ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఎస్పీ సిద్దార్థ కౌశల్‌ మాట్లాడుతూ ప్రత్యేకంగా అధ్యయనం చేసి విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. నిర్వాహకులు ప్రస్తావించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్‌ కమిషనర్‌ సూర్య సాయి ప్రవీణ్‌చంద్‌ మాట్లాడుతూ రోడ్ల విస్తరణతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైతే బారికేడ్లు ఏర్పాటు చేస్తామని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం దర్గా ప్రతినిధులతో కలిసి ఉత్సవాల కార్యక్రమాలతో కూడిన పోస్టర్లను ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్‌, తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌ కుమార్‌, శిక్షణా కలెక్టర్‌ మౌర్య భరద్వాజ్‌, డీఆర్వో గంగాధర్‌ గౌడ్‌, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, డిప్యూటీ కలెక్టర్‌ ప్రత్యూష, నగర కార్పొరేటర్లు, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రముఖులు హాజరయ్యారు.

ఉరుసు ఉత్సవాల వివరాలు
- నవంబరు 13న నషాన్‌ కార్యక్రమం నిర్వహిస్తారు.
- 25 నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం
- 26న గంధం, 27న ఉరుసు, 28న తహలీల్‌ ఫాతెహా, ముషాయిరా నిర్వహిస్తారు.
- 29న ప్రముఖ గాయకులచే ఖవ్వాలీ కచేరీ ఉంటుంది.
- 30న పీఠాధిపతి హజరత్‌ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్‌ గండి వాటర్‌ వర్క్స్‌ వద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తారు. ఆ రాత్రి తెల్లవారుజాము వరకు ఊరేగింపు ఉంటుంది.
- డిసెంబరు 1న పీఠాధిపతి అనుమతితో ఉరుసు ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

అభివృద్ధి పనులు వేగవంతం

పాడా సమీక్షలో కలెక్టర్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్‌: పులివెందుల నియోజకవర్గంలో పాడా కింద చేపట్టిన అభివృద్ధి పనులు డిసెంబర్‌ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్‌ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు అంశాలను సమీక్షించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ సీఎం జగన్‌ మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో పనులన్నీ వేగవంతం చేయాలన్నారు. సిటీ సెంట్రమ్‌, ఉలిమెల్ల లేక్‌ వ్యూ, జగనన్న హౌసింగ్‌ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు మోడల్‌ టౌన్‌లో భాగంగా చేపట్టే వివిధ పనుల కోసం భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కలెక్టర్‌ మౌర్య, పాడా ఓఎస్డీ అనిల్‌ కుమార్‌ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సీడీపీఓలు బాధ్యతగా పనిచేయాలి
కడప సెవెన్‌రోడ్స్‌: సీడీపీఓలు బాధ్యతగా పని చేసినప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని చూడగలమని కలెక్టర్‌ విజయరామరాజు అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమం–సాధికారత శాఖ పీడీ శ్రీలక్ష్మీ, రాష్ట్ర మహిళా కమిషన్‌ సభ్యురాలు గజ్జెల వెంకటలక్ష్మీతో కలిసి కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సీడీపీఓలతో కలెక్టర్‌ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను పొందుతున్న ప్రతి లబ్ధిదారు కుటుంబం అంగన్వాడీ సేవలు కూడా పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సీడీపీవో రోజుకు రెండు అంగన్వాడీ కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్య స్థితి, సంక్షేమ వసతి గృహాల్లో బాలికల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా బాలికలకు, బరువు తక్కువ పిల్లలకు పోషకాహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. చైల్డ్‌ మ్యారేజెస్‌, టీనేజ్‌ ప్రెగ్నెన్సీలను ప్రోత్సహించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం జరిగితే.. వారి తల్లిదండ్రులపై కేసులు ఫైల్‌ చేయాలన్నారు. వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్‌ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్‌ ఆదేశించారు.

26 నుంచి డోర్‌ డెలివరీ మాసోత్సవాలు
కడప కోటిరెడ్డిసర్కిల్‌: ఏపీఎస్‌ఆర్టీసీలో కార్గో ద్వారా పార్సిళ్లు, కొరియర్లు పంపిణీ చేసే డోర్‌ డెలివరీ వ్యవస్థను విస్తృతం చేయాలనే సంకల్పంతో ఈ నెల 26వ తేదీ నుంచి నవంబరు 25వ తేదీ వరకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకూ పరిమిత స్థాయిలోనే డోర్‌ డెలివరీ పంపిణీ జరుగుతోందని, ప్రజా దరణ దృష్టిలో పెట్టుకుని డోర్‌ డెలివరీ సదుపాయాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుగు ప్రయాణానికి ప్రత్యేక బస్సులు
కడప కోటిరెడ్డి సర్కిల్‌: దసరా పండుగ అనంతరం ఆయా ప్రాంతాల నుంచి తిరిగి వెళ్లే వారి కోసం 170 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేక బస్సులైనప్పటికీ వాటిలో సాధారణ ఛార్జీలే ఉంటాయని తెలిపారు. హైదరాబాద్‌కు 60, బెంగుళూరుకు 60, చెన్నైకు 20, విజయవాడకు 30 బస్సులు నడుపుతున్నామన్నారు. వాటిలో ముందస్తు టిక్కెట్లు పొందేందుకు ఆన్‌లైన్‌ రిజర్వేషన్‌ సౌకర్యం కల్పించామన్నారు.

27న జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు

డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: రాయచోటిలోని డైట్‌ కళాశాలలో ఈ నెల 27న జానపద నృత్యం, రోల్‌ ప్లే (పాత్ర పోషణ) పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌ జిల్లా డీఈఓ, రాయచోటి డైట్‌ కళాశాల ప్రిన్సిపల్‌ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8, 9వ తరగతులకు జానపద నృత్యం, తొమ్మిదో తరగతి విద్యార్థులకు రోల్‌ ప్లే పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో(ప్రభుత్వ, జెడ్పీ, ఆదర్శ, ఎయిడెడ్‌, గురుకుల, కేజీబీవీ)చదివే విద్యార్థులంతా పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పాల్గొనదలచిన విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌ పంపాలన్నారు. ఒక పోటీలో పాల్గొన్న వారు ఇంకో పోటీకి అనర్హులని తెలిపారు. రోల్‌ ప్లేకు నలుగురు లేక ఐదుగురు, జానపద నృత్యాలకు ఆరుగురు విద్యార్థులు ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 9.30 గంటలకు రాయచోటి డైట్‌ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని తెలిపారు. వరుస ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. వివరాలకు అజయ్‌కుమార్‌బాబు (9347541312), శ్రీదేవి (9441228359), అసదుల్లా (9440084715)లను సంప్రదించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

రోల్‌ప్లే పోటీల థీమ్స్‌...
ఆరోగ్యంగా ఎదగడం, పౌష్టికాహారం.. శ్రేయస్సు, వ్యక్తిగత భద్రత(శారీరక, మానసిక, భావోద్వేగ మరియు లైంగిక), ఇంటర్నెట్‌, గాడ్జెట్లు, మీడియా అక్షరాస్యత.. సురక్షిత ఉపయోగం. పదార్థ దుర్వినియోగం.. కారణాలు, నివారణ అంశాలపై రోల్‌ ప్లే పోటీలుంటాయి.

జానపద నృత్య పోటీల థీమ్స్‌...
బాల, బాలికలకు సమానావకాశాలు, పిల్లల అభివృద్ధిలో ఉమ్మడి కుటుంబం పాత్ర, పర్యావరణ పరిరక్షణ, పదార్థాల దుర్వినియోగం..నివారణ, కౌమార దశలో ఆరోగ్యకరమైన సంబంధాలు అంశాలపై పోటీలు నిర్వహించనున్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం





ప్రొద్దుటూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, చిత్రంలో జెడ్పీ చైర్మన్‌, ఎమ్మెల్యే, తదితరులు

- 28న సామాజిక సాధికారత బస్సు యాత్ర
- రాయలసీమలో తొలి సభ ప్రొద్దుటూరులోనే
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌ బాబు

ప్రొద్దుటూరు: జగనన్న పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 28న చేపట్టే సామాజిక సాధికారతా బస్సు యాత్రను జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కడప ఆర్‌అండ్‌బీ అతిథి భవనం ఆవరణలో నియోజకవర్గ కార్యకర్తలతో బుధవారం ఎంపీపీ శేఖర్‌ యాదవ్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడుతూ నామినేటెడ్‌ పోస్టులన్నింటిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సీఎం న్యాయం చేశారన్నారు. నాలుగు రాజ్యసభ స్థానాల్లో రెండు బీసీలకు కేటాయించిన ఘనత వైఎస్సార్‌ కాంగ్రెస్‌ ప్రభుత్వానిదే అన్నారు. మంత్రి పదవుల్లోనూ అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి సముచిత స్థానం కల్పించారని చెప్పారు. గత ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలిచ్చి అమలు చేయని కారణంగానే ఓడించారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతినెలా ఒకటో తేదీనే వృద్ధులు పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31,60,000 ఇళ్లను పేదలకిచ్చారని, గత మూడు విడతల్లో రూ.21 వేలు డ్వాక్రా రుణాల మాఫీ చెల్లించడం జరిగిందన్నారు. వేలాది మంది హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌ చొరవతో కడప నగర మేయర్‌ పోస్టును బీసీలకు, ప్రొద్దుటూరు మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పోస్టును బీసీ మహిళకు కేటాయించారన్నారు. ప్రతి మున్సిపాలిటీలో, మండలంలో బీసీ వైస్‌ చైర్మన్‌, బీసీ ఉప మండలాధ్యక్షుడు ఉన్నారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌ ఎంతో నమ్మకంతో తొలిమారు ప్రొద్దుటూరులో సామాజిక సాధికారత బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 28న జరిగే కార్యక్రమానికి తిరుపతి ఎంపీ డాక్టర్‌ గురుమూర్తి, మాజీ మంత్రి అనిల్‌ కుమార్‌ యాదవ్‌, మాజీ ఎంపీ బుట్టా రేణుక, టీటీడీ బోర్డు మెంబర్‌ యానాదయ్య తదితరులు హాజరవుతారన్నారు. సాయంత్రం మూడు గంటలకు రామేశ్వరం నుంచి వన్‌టౌన్‌ సర్కిల్‌, గాంధీ రోడ్డు, విజయకుమార్‌ సర్కిల్‌, రాజీవ్‌ సర్కిల్‌ మీదుగా పుట్టపర్తి సర్కిల్‌ వరకు బస్సుయాత్ర సాగుతుందన్నారు. మన ప్రభుత్వంలో కులాల వారీగా ఎవరెవరు? ఏమి లబ్ధి పొందారనే విషయాన్ని వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్‌ చైర్మన్‌ ఖాజా, ఆప్కాబ్‌ చైర్‌ పర్సన్‌ మల్లెల ఝాన్సీరాణి, పద్మశాలీ కార్పొరేషన్‌ చైర్‌ పర్సన్‌ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, జేసీఎస్‌ జిల్లా కన్వీనర్‌ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌సీపీఏ మెంబర్‌ కాకర్ల నాగేశారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, రాజుపాళెం వైస్‌ ఎంపీపీ నారాయణరెడ్డి, రాజుపాళెం జెడ్పీటీసీ అంజనీకుమారి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాం రెడ్డి, మద్దూరిదేవి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు
కడప అగ్రికల్చర్‌: జిల్లాలో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో బోర్లలో నీరు తగ్గుముఖం పట్టింది. దీంతో పంటకు నీరందక కూరగాయల దిగుబడులు తగ్గుతున్నాయి. కిలో రూ.10 ఉన్న టమోటా ధర ప్రస్తుతం రూ.18 రూపాయలకు చేరింది. పది రోజుల కిందట కిలో ఉల్లి ధర రూ.35 ఉండగా, ప్రస్తుతం రూ.40కి చేరింది. కిలో బీన్స్‌ రూ. 80, చామగడ్డ, కాప్సికం కిలో రూ.60, క్యారెట్‌ కిలో రూ.58, ఆలసందలు కిలో రూ.55, చిక్కుడుకాయ కిలో రూ.50, కాలీఫ్లవర్‌ కిలో రూ.45. బజ్జి మిరపకాయ, బంగాళా దుంప, అనపకాయలు, బీట్రూట్‌, ముల్లంగి కిలో రూ.40, బీరకాయ కిలో రూ.35, మిరపకాయ, దొండకాయ, దోసకాయలు కిలో రూ.30, కాకరకాయ కిలో రూ. 25, వంకాయ కిలో రూ.24, మిట్టిక్కా, క్యాబేజీ కిలో రూ. 20, బెండకాయ కిలో రూ. 16 ధరలు పలుకుతున్నాయి. ఇకపోతే కిలో అల్లం ధర రూ. 150 వరకు పెరిగాయి. సామాన్యులకు ఈ ధరలు కాసింత భారంగానే ఉన్నాయి.



18 రూపాయలకు చేరిన టమోటా ధరలు

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని సీఎస్ఐ చర్చి సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక విద్యానగర్‌కు చెందిన శివకుమార్ తన ద్విచక్ర వాహనంలో సిద్దవటం రోడ్డులో వస్తుండగా నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కడప నుంచి బద్వేలు మీదుగా నెల్లూరుకు వెళుతూ సీఎస్ఐ చర్చి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన యువకుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన నన్నేబా

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలం కడప రోడ్డులోని మూన్‌లైట్ హోటల్ వేబ్రిడ్జి సమీపంలో కారు ఢీకొని పట్ట నన్నేబా(52) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. సంఘటన స్థలాన్ని ఎర్రగుంట్ల పోలీసులు పరిశీలించారు. వారు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని తిప్పలూరు గ్రామానికి చెందిన నన్నేబా బుధవారం ఉదయాన్నే పని నిమిత్తం స్వగ్రామం నుంచి ఎర్రగుంట్లకు బైకులో తమ్ముడితో కలిసి బయలు దేరాడు. కడప రోడ్డులోని మూన్‌లైట్ హోటల్ వద్దకు రాగానే కడప వైపు నుంచి వస్తున్న కారు బైకు వెనుక వైపున ఢీకొంది. ఈ ప్రమాదంలో నన్నేబాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమ్ముడికి మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

- టెంట్ ఎల్లో చామంతి పూల సాగుపై రైతుల ఆసక్తి
- కొత్తగా సాగు చేస్తున్న రైతులు
- మార్కెట్లో కిలో బంతి రూ.100 నుంచి రూ.120
- ఆశించిన ఆదాయంతో రైతుల్లో ఆనందం

విరులు.. సిరులు.!



గుర్రంకొండ మండలం కొత్తపల్లె రైతులు సాగు చేసిన టెంట్ ఎల్లో రకం పూల తోటలు (ఇన్‌సెట్) కోత కోసి రవాణాకు సిద్ధం చేసిన టెంట్‌ఎల్లో రకంపూలు

గుర్రంకొండ : టెంట్‌ఎల్లో చామంతి(నాటి చామంతి) పూల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది నుంచి ఇక్కడి రైతులు కొత్తగా ఈ రకం పూలసాగును చేపట్టారు. ఈ రకం పూల సాగుతో రైతుకు నిలకడైన ఆదాయం వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధర రూ. 100 నుంచి రూ.120 వరకు ధరలు పలుకుతున్నాయి. గత ఏడాది దసరా, దీపావళి పండుగల సమయాల్లో కిలో పూల ధర రూ. 100 నుంచి రూ.200 వరకు పలికింది. దీంతో ఈ కొత్తరకం పూలసాగుతో రైతులు లాభాల బాట పడుతున్నారు.

ఎకరానికి రూ.1.50 ఖర్చు

టెంట్ ఎల్లో పూలసాగు దుక్కుల దగ్గర నుంచి పూలు చేతికొచ్చేంత వరకు రూ.1.50 వరకు ఖర్చు వస్తుంది. ఎకరానికి 8వేలు నుంచి 10 వేల మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఒక నారు మొక్క మార్కెట్లో రూ. 3 వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఎకరానికి రూ. 30 వేలు నారు మొక్కలకు ఖర్చు వస్తుంది. ఎరువులు, పురుగుల మందుల పిచికారి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టమాటా తోటల మాదిరిగా ఈ మొక్కలకు సీడ్ కట్టెలు నాటే ప్రక్రియను రైతులు చేపట్టారు. తద్వారా తోటలు వర్షాలకు దెబ్బతినకుండా ఏపుగా పెరుగుతుంటాయి. పూల మొక్కలు నాటిన 120 నుంచి 150 రోజుల మధ్యలో పూల దిగుబడి మొదలవుతుంది.

కర్ణాటక నుంచి దిగుమతి

ప్రస్తుతం ఈ రకం పూల నారు మన రాష్ట్రంలోని నర్సరీల్లో లభించడం లేదు. దీంతో మన జిల్లా రైతులు కర్ణాటక రాష్ట్రం నుంచి ఈ పూల నారుమొక్కలను దిగుమతి చేసుకుంటున్నారు. సాధారణంగా ఇక్కడి నర్సరీల్లో రూ. 1 నుంచి రూ. 2 వరకు నారు మొక్కల ధరలు ఉంటాయి. ప్రస్తుతం వీటికి ఎక్కువగా డిమాండ్ ఉండడంతో రైతులు బయట రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొంటుండడం గమనార్హం.

సాధారణ చామంతితో పోల్చితే బరువు ఎక్కువ

సాధారణ చామంతి పూలతో పోల్చితే ఈ రకం పూలు బరువు ఎక్కువ. సాధారణ చామంతి పూల రేకుల్లా కాకుండా టెంట్ ఎల్లో చామంతి రేకుల బరువు వైవిధ్యంగా ఉంటుంది. తొందరగా రేకులు రాలిపోవు, రబ్బరు లాగా పువ్వుకే అతుక్కొని ఉంటాయి. వీటికి సాధారణ చామంతి పూల కంటే ఎక్కువ రోజులు వాడిపోకుండా ఉండగల స్వభావం ఉంది. అందుకనే మార్కెట్లో ఈ రకం పూలకు ప్రత్యేకత ఉంది. ప్రస్తుతం పసుపురంగు ఉన్న పూలతో పాటు ఇప్పుడిప్పుడే తెలుపు రంగు రకం పూల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తుండడం విశేషం.

ఎకరానికి 4నుంచి 5 టన్నుల దిగుబడి

టెంట్‌ఎల్లో పూల సాగులో 4 నుంచి 5టన్నుల పూల దిగుబడి వస్తుంది. ఇంకా మంచి ఎరువులు వేసి సకాలంలో తోటలను కాపాడుకుంటే మరో టన్ను వరకు అధిక దిగుబడి రావచ్చు. సాధారణంగా 120 నుంచి 150 రోజుల నుంచి పూల దిగుబడి ప్రారంభమైన మరో 90 రోజుల పాటు పూల కోతలు వస్తుంటాయి. ఈ లెక్కన పంట మొత్తం కాలం 7 నెలల పాటు ఉంటుంది.

మార్కెట్లో కిలో రూ. 100 నుంచి రూ.120

ప్రస్తుతం ఈ రకం పూలు మార్కెట్లో కిలో రూ.100 నుంచి రూ.120 వరకు ధరలు పలుకుతున్నాయి. ఇవే ధరలు మార్కెట్లో నిలకడగా ఉంటే రైతులు మంచి లాభాలు చూసే అవకాశముంది. ఈ లెక్కన ఎకరానికి రూ.4 లక్షల నుంచి రూ.5.20 లక్షల ఆదాయం వస్తుంది. పంటసాగు ఖర్చు, కోత కూలీలు, రవాణా ఖర్చులు పోను ఎకరానికి రూ. 2.50 లక్షల నుంచి రూ. 3.70 లక్షల వరకు లాభాలు చవిచూసే అవకాశముంది. మార్కెట్లో ధరల నిలకడను బట్టి ఆదాయ, లాభాలు మారవచ్చు. నిలకడైన ఆదాయం వచ్చే ఇలాంటి కొత్తరకం పూల సాగుపై రైతులు ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపిస్తున్నారు.

పండుగ సీజన్‌లో కిలో రూ.100 నుంచి రూ.200

టెంట్ ఎల్లో రకం చామంతి పూలకు పండుగ సీజన్‌లలో మంచి ధరలు లభిస్తాయి. గత దసరా, దీపావళి పండుగ సీజన్‌లో మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కిలో రూ. 100 నుంచి రూ.200 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం పడమటి ప్రాంతాల రైతులు ఈ రకం పూల సాగు ఎక్కువగా చేపట్టారు. ప్రస్తుతం దసరా, ఆ తరువాత కార్తీక మాసం కావడంతో పాటు రానున్న జనవరిలో సంక్రాంతి పండుగల సీజన్‌లో మంచి ధరలు పలికే అవకాశముంది.

ఎకరంలో సాగు చేశా



టెంట్‌ఎల్లో రకం పూలను ఎకరం పొలంలో సాగు చేశాను. నారు మొక్కలు నాటిన నుంచి పూల కోతలు మొదలయ్యే వరకు ఎకరానికి రూ. లక్ష వరకు ఖర్చు వచ్చింది. సాధారణ చామంతి పూలతో పోల్చితే ఈ రకం పూలలో నాణ్యత ఎక్కువగా ఉంటుంది. మార్కెట్లో కూడా వీటికి మంచి డిమాండ్ ఉంది. – రమణ, పూలరైతు, గంగిరెడ్డిగారిపల్లె

నిలకడైన ఆదాయం



ఈ రకం పూలసాగులో రైతుకు నిలకడైన ఆదాయం వస్తుంది. మార్కెట్లో పూల ధరలు కొద్ది రోజులపాటు నిలకడగా ఉంటే నష్టాలు రావు. పూలు కూడా మార్కెట్‌కు తీసుకెళ్లేంత వరకు దెబ్బతినకుండా ఉంటాయి. సాధారణ చామంతితో పోల్చితే ఈ రకం పూలు తొందరగా పాడవవు. ఎకరానికి ఎంత లేదన్నా రూ. 4 లక్షల ఆదాయం వస్తుంది. – రెడ్డిమోహన్, పూల రైతు, చెరువుమొరవపల్లె

ఆగిన టిప్పర్‌ను ఢీకొని ఇరువురు యువకుల దుర్మరణం


సంఘటన స్థలంలో మృతి చెందిన ఇద్దరు యువకులు మస్తాన్ రెడ్డి, అల్తాఫ్


మస్తాన్ రెడ్డి (ఫైల్)


అల్తాఫ్ (ఫైల్)

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని కొర్రపాడు-గోపవరం గ్రామాల మధ్యలో ఆగి ఉన్న మట్టి టిప్పర్‌ను ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇరువురు యువకులు దుర్మరణం చెందారు. పోలీసుల తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాళెం గ్రామానికి చెందిన నంద్యాల మస్తాన్ రెడ్డి (19), బంగ్లా అల్తాఫ్ (18) అనే ఇద్దరు యువకులు బుధవారం సాయంత్రం తమ సొంత పని మీద ప్రొద్దుటూరు పట్టణానికి ద్విచక్రవాహనంలో వెళుతున్నారు. ఈ క్రమంలో ఆగి ఉన్న మట్టి టిప్పర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ఆ యువకులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ రమణారెడ్డి, రాజుపాళెం ఎస్ఐ రాజగోపాల్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదం జరిగిన తీరును వారు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. మస్తాన్ రెడ్డి తల్లిదండ్రులకు ఒకే ఒక్క కుమారుడు కావడంతో వారి వేదన వర్ణనాతీతం. బంగ్లా అల్తాఫ్ తండ్రి అబ్దుల్, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఇరువురు ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో రాజుపాళెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ముగ్గురు పోలీసులకు 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు'


పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో ఇటీవల జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అత్యుత్తమ పని తీరు కనబరచిన సిబ్బందికి 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు'ను అందజేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మొట్ట మొదటిసారిగా ముగ్గురు సిబ్బందిని ఎంపిక చేసి బుధవారం కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నగదు రివార్డు, ప్రశంసాపత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో 8 ఏళ్ల క్రిందట జరిగిన హత్య కేసులో నాన్ బెయిలబుల్ వారంట్ ఉంటూ తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని శ్రమించి అరెస్ట్ చేశారు. ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు బి. శ్రీనివాస్ (పి.సి.2859),ఎస్. మధుసూదన్‌రెడ్డి (పి..సి.2687)లకు జిల్లా ఎస్పీ నగదు రివార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. అలాగే చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ద్విచక్ర వాహనాల దొంగ నుంచి 6 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎస్.కె బాషా (పి.సి. 2118)ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. స్ఫూర్తిదాయకమైన సేవలు అందించి పోలీసుశాఖ ఔన్నత్యాన్ని పెంచారని, మున్ముందు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

సత్తాచాటిన వైఎస్సార్ జిల్లా ఎడ్లు


ఆకవీడులో బండలాగుతున్న ఎడ్ల జతలు

రాచర్ల : ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలోని ఆకవీడు గ్రామంలో షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ పెద్దబండ ఎడ్ల బండలాగుడు పోటీల్లో వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం బాలుగారిపల్లె గ్రామానికి చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎడ్ల జతలు సత్తాచాటాయి. ఈ ఎడ్ల పోటీల్లో మొత్తం 11 జతల ఎడ్లు పాల్గొనగా టంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వర రావు ఎడ్ల జతలు నిర్ణీత 20 నిమిషాల్లో 2094 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. అదేవిధంగా వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం బాలుగారిపల్లె గ్రామానికి చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎడ్లు 2022 అడుగులు లాగి రెండో బహుమతి, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పి.ఆర్‌పల్లె గ్రామానికి చెందిన ఎమ్.నాగయ్య ఎడ్ల జతలు 1937 అడుగులు లాగి మూడో బహుమతి, వైఎస్సార్ జిల్లా కమలాపురం గ్రామానికి చెందిన తోట కుమారి ఎడ్ల జతలు 1846 అడుగులు లాగి నాల్గవ బహుమతి పొందాయి.

భర్త ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

– భార్య, మరో ఇద్దరిపై కేసు నమోదు


శివశంకర్‌రెడ్డి(ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : వివాహేతర సంబంధం భర్త ప్రాణాలను తీసింది. భార్య వివాహేతర సంబంధాన్ని పసిగట్టిన భర్తను చంపేందుకు ఆమె ఇద్దరు వ్యక్తులతో కలసి భర్తను వెంటాడింది. దీంతో భయపడిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రొద్దుటూరు మండలంలోని దొరసానిపల్లె గ్రామానికి చెందిన కందుకూరి శివశంకర్‌రెడ్డి (33) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శివశంకర్‌రెడ్డి జేబులో ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్ నోట్‌లో వివరాలు ఇలా ఉన్నాయి.. రాజుపాళెం మండలం అరకటవేముల గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డికి కడపకు చెందిన ప్రేమలలితతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ప్రొద్దుటూరు మండలంలోని దొరసానిపల్లె సచివాలయంలో జీఎంఎస్‌కే ఉద్యోగం రావడంతో భార్యాభర్తలు అక్కడే నివాసం ఉంటున్నారు. ప్రేమలలిత ఏడాది నుంచి అదే ప్రాంతానికి చెందిన పబ్బతి శ్రీను అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో పలుమార్లు మందలించాడు. అయినా ఆమె లో మార్పు రాలేదు. ఈ క్రమంలో దసరా పండుగ సందర్భంగా శివాలయానికి వెళ్లాలని భార్య అడగడంతో 23న రాత్రి శివాలయం వద్దకు తీసుకెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత భార్య పక్క న పబ్బతి శ్రీను ఉండటాన్ని చూసిన శివశంకర్‌రెడ్డి అతన్ని వెంబడించాడు. అతని రాకను పసిగట్టిన పబ్బతిశ్రీను కంపచెట్లలో దాక్కున్నాడు. అతన్ని పట్టుకోవడానికి ప్రయత్నించగా భార్య ప్రేమలలిత భర్తను అడ్డుకుంది. ఈ క్రమంలోనే శివశంకర్‌రెడ్డి పబ్బతి శ్రీనును పట్టుకొని సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లాడు. తర్వాత భార్య ప్రేమలలిత, పబ్బతి శ్రీను, తీట్ల రాజా అనే వ్యక్తులు అతనికి ఫోన్ చేసి సెల్‌ఫోన్ ఇవ్వకుంటే చంపుతామని బెదిరించారు. ఈ క్రమంలోనే పొట్టిపాడు బైపాస్‌రోడ్డులో శివశంకర్‌రెడ్డిని వారు వెంటపడ్డారు. దీంతో వాళ్లు చంపుతారేమో నని భయపడిన అతను చెన్నమరాజుపల్లె సమీపంలోని కేసీ కాలువ వద్ద 24వ తేదీ మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి పడిపోయాడు. అతన్ని గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడు ఆత్మహత్యకు కారణమైన కోడలు ప్రేమలలిత, పబ్బతిశ్రీను, తీట్ల రాజాలపై చర్యలు తీసుకోవాలని తండ్రి చిన్న ఈశ్వరరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెకు చెందిన దాదిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి భార్య రాజ్యలక్ష్మి మెడలోని మూడు తులాల బరువు గల బంగారు గొలుసును బుధవారం పట్టపగలే గుర్తు తెలియని దొంగ చోరీ చేశాడు. రాజ్యలక్ష్మి గ్రామానికి చెందిన పలువురు మహిళలతో కలిసి రోజులాగే వెంకటాపురం వీవర్స్ కాలనీ సమీపంలో పాపాఘ్ని నది ఒడ్డున ఉన్న అటవీ శాఖ భూముల్లో పశువులను మేపుకోవడానికి వెళ్లింది. మహిళలు పశువులు పక్కకు పోకుండా చూసే క్రమంలో తలా ఒక వైపున కాపలా ఉన్నారు. ఒక వైపున చెట్టు కింద ఒంటరిగా కూర్చొని ఉన్న ఆమె మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగ వెనుక వైపు నుండి చాటుగా వచ్చి కత్తిరించుకెళ్లాడు. ఆమెతో బాటుగా తోటి మహిళలు కేకలు వేయడంతో దుండగుడు సమీపంలోని ముల్ల పొదల్లోకి చొరబడి పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు వల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భయాందోళనలో ప్రజలు

కాగా గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలో ఇటీవల వరుసగా పట్టపగలే చైన్ స్నాచింగ్‌లు జరగడం పట్ల మండల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ నెలలోనే వల్లూరులోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసును పట్టపగలే గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు. అయితే అవి గిల్ట్ నగలు కావడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ఇష్టపడనట్లు తెలుస్తోంది. తరువాత మిట్టపల్లెకు చెందిన ఒక మహిళ పశువులను మేపుకుంటుండగా ఒక గుర్తు తెలియని యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. దీనిపై వారు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా దుగ్గాయపల్లె వెంకటాపురం వీవర్స్ కాలనీ సమీపంలో మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించారు. వరుసగా 20 రోజుల వ్యవధిలోనే మూడు చైన్ స్నాచింగ్‌లు జరగడంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

టైల్స్, శానిటరీ షోరూం ప్రారంభం


షోరూం నిర్వాహకులతో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, తదితరులు

ప్రొద్దుటూరు క్రైం : కడప నగరంలోని మద్రాస్ రోడ్డులో తేజ టైల్స్, శానిటరీ షోరూం (రెండో బ్రాంచ్)ను సంస్థ అధినేతలు కావలి రఘుతేజ, కావలి విశ్వతేజలు బుధవారం పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియాలో అతిపెద్ద కంపెనీలు అయిన కజారియ, క్యుటోన్, జాగ్వర్, ఎంవైకె లాటిక్రాట్, ఎలిక చిమ్నీస్, కెరోవిట్, ఐబీస్ మొదలగు ప్రసిద్ధ కంపెనీలకు సంబంధించిన టైల్స్, శానిటరీవేర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫుల్ బాడీ టైల్స్, జీవీటీ, పీజీవీటీ స్లాబ్స్, డబుల్ ఛార్జర్, శానిటరీ వేర్‌తో పాటు విదేశాల నుంచి కూడా డిజైనర్ టైల్స్ తెప్పించడం తమ ప్రత్యేకత అని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్‌రెడ్డి, నంద్యాల వరదరాజులరెడ్డి, పులివెందుల వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కావలి కృష్ణతేజ, మానవతా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీ అధినేత కందుల చంద్రఓబుళరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, వేంపల్లి జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర ఏపీసీసీ డైరెక్టర్ కల్లూరు చంద్రఓబుళరెడ్డి, టీడీపీ నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్, శంకర్‌రెడ్డి, ఎస్ఆర్ఎస్ డయాగ్నొస్టిక్ అధినేత డాక్టర్ వంశీకృష్ణ, సామాజిక వేత్త పట్టుపోగుల పవన్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్, బ్రేస్‌లెట్ ప్రయాణికుడికి అప్పగింత


ప్రయాణికుడికి ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

మైదుకూరు : బస్సులో మరిచిపోయిన బ్యాగ్‌లో ఉన్న ల్యాప్‌టాప్, బంగారు బ్రేస్‌లెట్‌లను మైదుకూరు ఆర్టీసీ అధికారులు బాధిత ప్రయాణికుడికి అప్పజెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. బ్రహ్మంగారిమఠం మండలం ఎద్దులాయపల్లెకు చెందిన మల్లె వెంకటేష్ బుధవారం మైదుకూరుకు వచ్చేందుకు కడప బస్‌స్టాండ్‌లో బస్సు ఎక్కి కూర్చున్నాడు. ఆ సమయంలో మరో బస్సు మైదుకూరు వైపునకు వెళ్లేందుకు కదులుతుండటంతో తాను ఎక్కిన బస్సు దిగి వెంకటేష్ ఆ బస్సులో మైదుకూరుకు వచ్చాడు. ముందు కూర్చున్న బస్సులో బ్యాగ్ మర్చిపోవడంతో మైదుకూరు బస్టాండ్ ఎంక్వయిరీ వారికి సమాచారం ఇచ్చాడు. ఎంక్వయిరీలో ఉన్న నారాయణ, డిపోకు చెందిన జనరల్ ఏడీసీ లక్షుమయ్య మైదుకూరు డిపో బస్సు సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగ్‌ను తెప్పించారు. అందులో రూ.1.50 లక్షల విలువైన ల్యాప్‌టాప్, రూ.30వేలు విలువైన బంగారు బ్రాస్‌లెట్‌లను బాధిత ప్రయాణికుడికి సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర్లు ద్వారా అందించారు. వెంకటేష్ ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.